76809 94755 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2016-18

Dr. DWIBHASHYAM KASI VISHWANATH TEJASWI
ఏపీలో ప్రఖ్యాతిగాంచిన చింతలూరు ఆయుర్వేద వైద్యులు,
సంతానరాహిత్య సమస్యలకు
సంప్రదించండి
ph : 90329 90138, 93939 90138
email :dr.d.vishwanath@gmail.com
AYYAPPA AYURVEDIC SYNDICATE
Visakhapatnam

రాజధాని వార్తలు

Voice of Voiceless

రాజధాని వార్తలు దినపత్రికలో
పనిచేయుటకు నలభై ఎడిటర్లు, రాష్ట్రవ్యాప్తంగా ఎడ్వటైజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, రిపోర్టర్‌లు కావలెను
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును.
76809 94755
rajadhanivartalu1@gmail.com

అమరావతి సంపుటి : 4 సంచిక 11, పేజీలు 4, వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 3 - ఆదివారం 9 డిసెంబర్, 2018

వివరాలు2లో...

సామాజిక వేత్త అంబేద్కర్

వివరాలు3లో...

కులమే జీవితం

వివరాలు4లో...

వారసత్వ సంపదను పరిరక్షించుకుందాం..

వివరాలు4లో...

తెలుగు బైబిల్‌కు 200 ఏళ్లు

తెలంగాణలో ఏపీ ఉద్యోగులు ఎవరి వైపు ?



రాజధాని వార్తలు బ్యూరో, అమరావతి : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. హైదరాబాద్‌లో పిల్లల చదువు కొనసాగిస్తూ, వారాంతరాల్లో అక్కడికి చేరుకునే సచివాలయ ఉద్యోగులు తమ ఓటును ఎవరికి వేస్తారనేదానిపై సర్వత్రా ఉత్కంఠత నెలకొంది. హైదరాబాద్‌లో ఓటు వేసేందుకు వీలు కల్పిస్తూ తమకు తెలంగాణ ఎన్నికల రోజున సెలవు మంజూరు చేయాలని ఏపీ ఉద్యోగ సంఘాల నాయకులు విజ్ఞప్తి చేసారు. ఈ మేరకు ప్రభుత్వం వారికి స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేసింది. దీంతో...ఉద్యోగులు తెలంగాణలో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అయితే, ఇప్పటికే తెలంగాణలో హెూరా హెూరీ పోరులో ప్రతీ నియోజకవర్గం..ప్రతీ వర్గం ఓట్లు కీలకంగా మారాయి. ఇప్పుడు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల ఓట్లు దక్కించుకోవటానికి సైతం పార్టీలు ప్రయత్నాలు మొదలు పెట్టాయి... . ఓటు వేసేందుకు వీలుగా ఏపీ ప్రభుత్వం డిసెంబరు 7న వారికి సెలవు ప్రకటించింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఏపీకి కేటాయించిన ఉద్యోగులు హైదరాబాద్ నుంచి అమరావతికి తరలినా.. ఓటు హక్కు మాత్రం తెలంగాణలోనే ఉంది. అమరావతి సచివాలయం, అసెంబ్లీ, శాసనమండలిలో మూడు వేల మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. మొత్తం 11 వేల మంది ఏపీ ఉద్యోగులతోపాటు వారి కుటుంబ సభ్యులు తెలంగాణ ఎన్నికల్లో ఓటేయొచ్చని అధికారిక వర్గాల అంచనా. ప్రతి ఓటు కీలకంగా మారుతుండటంతో..ఏపీ ఉద్యోగుల ఓట్లను తమ వైపు తిప్పుకొనేందుకు పార్టీలు ప్రయత్నాలు ప్రారం భించాయి. ఇప్పటికే ఉద్యోగ సంఘ నేతలను ఆకట్టుకొనే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఏపీ ఉద్యోగులు ఖచ్చితంగా తమ కే పట్టం కడతారని కాంగ్రెస్ –టీడీపీ నేతలు అంచనా వేస్తున్నారు. అయితే, ఏపీలో ప్రభుత్వంపై స్థానికంగా వ్యతిరేకత ఉందని..ఉద్యోగుల్లో సైతం అసంతృప్తి ఉందంటున్న టీఆర్ఎస్ నేతలు తమ పార్టీకే ఓటు వేసి టీడీపీపై తమకున్న అసంతృప్తిని తెలియచేస్తారని చెబుతున్నారు. అయితే, ఏపీ ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు ఎక్కువగా ఎల్‌బీనగర్, మహేశ్వరం, చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోనే ఉన్నట్లు చెబుతున్నారు. అదే సమయంలో ఆ నియోజకవర్గాల్లో ఏపీ సెటిలర్స్ ఓట్లు కీలకంగా మారనున్నాయ. వారికి తోడు ఏపీలో ఉద్యోగాలు చేస్తున్న వారి ఓట్లు సైతం గెలుపు ఓటముల పై ప్రభావం చూపించే అవకాశం ఉంది. దీంతో.. ఉద్యోగ సంఘ నేతలను ప్రసన్నం చేసుకొని..వారి ద్వారా తమ పార్టీకి అనుకూలంగా ఓట్లు వేయించుకొనేందుకు ఇప్ప టికే జోరుగా మంతనాలు సాగుతున్నాయి. మరి..ఉద్యోగులు ఎటు వైపు మొగ్గు చూపుతారో తెలియాలంటే డిసెంబరు 11 వరకు ఆగాల్సిందే.

ఏసీబీ VS సీబీఐ

రాజధాని వార్తలు బ్యూరో, అమరావతి : కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ, రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ ఏసీబీల మధ్య తాజాగా వివాదం నెలకొంది. లంచం డిమాండ్ చేసిన కేంద్ర పరోక్ష పన్నుల విభాగానికి చెందిన ఓ అధికారిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అవినీతి అధికారులను పట్టుకోవడానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లీక్ చేసి దానిని ఏసీబీకి అందించిందని సీబీఐ ధ్వజమెత్తింది. రాష్ట్రంలో సీబీఐ నేరుగా దర్యాప్తు జరిపేందుకు అనుమతి రద్దుచేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆధారంగా ఏపీ ఏసీబీ ఈ వ్యవహారంలో తన పని తాను చేసుకు పోయింది. ఈ నేపథ్యంలో కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని కేంద్ర సీజీఎస్టీ రేంజ్ అధికారి ముక్కు కాళీ రమణేశ్వర్‌పై లంచం తీసుకున్న కేసులో రాష్ట్ర ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. వాస్తవానికి కాళీ రమణేశ్వర్‌పై విశాఖ సీబీఐ అధికారులకు ముందుగా ఫిర్యాదు అందింది. దీనిపై విచారించేందుకు సీబీఐ రాష్ట్ర ప్రభుత్వ అనుమతి కోరింది. అంతేకాక.. విశాఖ నుంచి సీబీఐ ఎస్పీ స్థాయి అధికారి రాష్ట్ర హెూంశాఖ ముఖ్య కార్యదర్శిని సచివాలయంలో వ్యక్తిగతంగా కలిసి ఈ విషయంలో గోప్యత పాటించాలని కూడా విజ్ఞప్తి చేశారు కానీ, రాష్ట్ర ప్రభుత్వం ఆ వినతిని బేఖాతరు చేస్తూ సమాచారాన్ని ఏసీబీకి లీక్ చేసింది. దీంతో వారు రమణేశ్వర్‌పై కేసు నమోదు చేశారు. నిబంధనలను ఉల్లంఘించి మరీ ఈ కేసు నమోదు చేయడం ఇప్పుడు సీబీఐ, ఏసీబీలలో తీవ్ర దుమారం రేపుతోంది. కాగా, దర్యాప్తు చేయడానికి సహకారం అందించకుండా రాష్ట్ర ప్రభుత్వం, ఏసీబీ వ్యవహరించిన తీరును సీబీఐ విడుదల చేసిన ఒక ప్రకటనలో తీవ్రంగా తప్పుబట్టింది. ఏది ఏమైనా కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా తీము తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండాల్సిందేనని. ఎటువంటి పరిస్థితుల్లో వెనక్కు తగ్గకూడదని ఏపీ ప్రభుత్వం ధృడ నిశ్చయంతో ఉంది. తాజా ఘటనతో సీబీఐ కి మద్దతుగా కేంద్రం ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే.

బాబోయ్.. ఇవేం నోట్లు ?

పెద్ద నోట్లరద్దు తర్వాత మోడీ ప్రభుత్వం ముద్రించిన రూ.2000, రూ.500 నోట్లను చూసిన జనం అవాక్కయ్యారు. పిల్లలు చాక్లెట్లు కొనుక్కుంటే ఇచ్చే ఆడుకునే నోట్లులా ఉన్నాయని, ఇవి పాత నోట్లలా మానసికంగా భరోసా ఇవ్వడంలేదని వాపోయారు. రెండేళ్లుగా ఎలాకొలా వాటికే అలవాటు పడితే, నాణ్యతలేని ఈ నోట్లు కాస్త నలిగినా చెల్లకపోవడం దేశ ప్రజలను కలవరపరుస్తోంది.

రాజధాని వార్తలు డెస్క్, అమరావతి : నోట్ల రద్దు సమయంలో అత్యంత భద్రతా ప్రమాణాలతో కొత్త నోట్లను తెచ్చినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మరి రెండేళ్లకే అవి పనికి రాకుండా పోతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నోట్ల ముద్రణకు ఉపయోగించిన కాగితంలో నాణ్యత లేదా అనే సందేహం తలెత్తుతోంది. 2018లో జారీ చేసిన రూ.2 వేలు, రూ.500, రూ.10 నోట్లు పాడైపోతున్నాయి. నోట్ల రద్దు సమయంలో సామాన్య జనం చాలా ఇబ్బందులు పడ్డారు. రెండేళ్ల తర్వాత ఇప్పుడు మరో నరకం కనిపిస్తోంది. అవే కొత్త రూ.2 వేల, రూ.500 నోట్లు పనికిరాకుండా పోతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ నోట్లను ప్రవేశపెడుతున్న సమయంలో నకిలీ నోట్లు తయారుకావనీ, చింపితే చిరగవనీ, పాడయ్యే ప్రసక్తే ఉండదనీ కేంద్రం ప్రకటించింది. కాని రెండేళ్లకే కొత్త నోట్ల కంటే పాతవే నయం అన్న వాదన ప్రజల నుంచి వినిపిస్తోంది. కొత్త నోట్లకు తామరతంపరగా నకిలీ నోట్లు రావడమే కాదు, కొత్త కరెన్సీలో భద్రతా ప్రమాణాలు కనిపించటం లేదు. పాత రూ.100, రూ.500, రూ.1000 నోట్లు ఎన్ని మడతలు పెట్టినా, ఎక్కడ దాచిపెట్టినా దీర్ఘకాలం

- మిగతా 2 లో

అమెరికా మాజీ అధ్యక్షుడు హెచ్.డబ్ల్యూ. బుష్ కన్నుమూత

వాషింగ్టన్ : అమెరికా మాజీ అధ్యక్షుడు జార్జ్ హెచ్. డబ్ల్యూ. బుష్(94) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన శుక్రవారం రాత్రి తుది శ్వాస విడిచారు. 1989 అమెరికా 41వ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఆయన పాలనలో తనదైన ముద్ర వేసి కీర్తి గడించారు. కాగా ఆయన మృతి పట్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామ, అమెజాన్ సీఈఓ జెఫ్ బెజోస్, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ తదితర ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

ఎస్ఆర్ఎంలో మానవకణ పరిశోధన ప్రయోగశాల

ప్రారంభించిన ప్రొ వీసీ ఆచార్య నారాయణరావు

రాజధాని వార్తలు అమరావతి: (మంగళగిరి) ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన మానవ కణ పరిశోధన ప్రయోగశాలను ప్రొ వైస్ చాన్సలర్ ఆచార్య డి.నారాయణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచార్య నారాయణరావు మాట్లాడుతూ మానవ కణాలపై విస్తృత పరిశోధనలు చేసేందుకు ఈ ప్రయోగశాల దోహదపడుతుందన్నారు. మానవ కణాలలోని కేన్సర్ వ్యాధికారక లక్షణాలను గుర్తించడం, వాటి నివారణ వంటి అంశాలపై ఈ ప్రయోగశాలలో పరిశోధనలు జరుగుతాయని ఆయన తెలిపారు. సుమారు రూ.50 లక్షల ఖర్చుతో కణాలపై పరిశోధనలకు అవసరమైన అన్ని రకాల ఆధునిక పరికరాలు, కార్బన్ డై ఆక్సైడ్ తయారీ అత్యంత శక్తివంతమైన

- మిగతా2 లో

విజయవాడ ఎస్ఎల్‌వీ అమరావతి గ్రాండ్‌లో త్రినయన వెల్ఫేర్ ఫౌండేషన్ ప్రారంభోత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్

కార్యక్రమానికి విచ్చేసిన ప్రజలు

త్రినయన వెల్ఫేర్ ఫౌండేషన్ లక్ష్యాలు

మహిళా సాధికారత, పోషకాహార లోపం

దివ్యాంగులకు ఆరోగ్య భద్రత కల్పించడం

యువతకు ఉద్యోగాలు కల్పించే శిక్షణ ఇవ్వడం

రాజధాని వార్తలు అమరావతి: విజయవాడ ఎస్ఎల్‌వీ అమరావతి గ్రాండ్‌లో త్రినయన వెల్ఫేర్ ఫౌండేషన్ ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. త్రినయన వెల్ఫేర్ ఫౌండేషన్ డైరెక్టర్లు జి. మేఘన, ఐ. మూర్తి, ఆర్కే రెడ్డి, మాట్లాడుతూ మహిళలు, దివ్యాంగలు, యువతే లక్ష్యంగా తమ సంస్థ పని చేస్తుందని చెప్పారు.

లోనకి వెళ్లే దారేది..!

పైన మీరు చూస్తున్న ఫొటో ఎక్కడో మారుమూల పల్లెటూళ్లో అనుకుంటే మీరు పప్పులో కాలేసినట్టే. ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని ప్రాంతమైన రాయపూడిలోని మాతా శిశు ఆరోగ్య బృంద కేంద్రం. నవ్యాంధ్రలో అబ్బురపరిచే డిజైన్లను చూపిస్తున్న మన ఏపీ సీఎం చంద్రబాబు గారు దీనికి ఏం సమాధానం చెబుతారో చూద్దాం.

- రాజధాని వార్తలు, రాయపూడి

'ఏపీలోనూ వేలుపెడతాం..'

టీఆర్ఎస్ నేత, మంత్రి కేటీఆర్

హైదరాబాద్: టీఆర్ఎస్ నేత, మంత్రి కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజకీయంగా చంద్రబాబు అంతుచూసేందుకు అవసరమయితే ఏపీలోనూ వేలుపెడతామని ప్రకటించారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు తెలంగాణ రాజకీయాల్లో అనవసరంగా వేలుపెట్టారన్నారు. నాలుగు బిల్డింగులు కట్టి చంద్రబాబే అంత ఫోజు కొడితే అసాధ్యమనుకున్న తెలంగాణను తెచ్చిన కేసీఆర్‌కు ఎంతుండాలని కేటీఆర్ ఎద్దేవా చేశారు. తాము కూడా ఏపీ రాజకీయాల్లో వేలుపెడతామని స్పష్టం చేశారు. రాజకీయంగా చంద్రబాబు సంగతి తేలుస్తామన్నారు. ఆ దిశగా భవిష్యత్తులో నిర్ణయం ఉంటుందన్నారు.

రాజధాని వార్తలు కలం

ఎన్నికల కోలాహలం

నాలుగు రాష్ట్రాల్లోని ఎన్నికల ప్రచారం తారాస్థాయికి చేరుకుంది. వచ్చేఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటి ఫలితాలు దర్పణం పడతాయని రాజకీయపార్టీలు భావిస్తున్నాయి. వాస్తవానికి డిసెంబరు 11న ఎన్నికల ఫలితాల వెల్లడికోసం ఐదు రాష్ట్రాలు ఎదురు చూస్తున్నాయి. 90 అసెంబ్లీ స్థానాలున్న చత్తీస్‌గఢ్ ఎన్నికలు నవంబరు 12,20 తేదీల్లోనే పూర్తికావడంతో అక్కడి నేతల భవితవ్యం బ్యాలెట్ పెట్టెల్లో భద్రంగా ఉంది. మావోయిస్టులు ఎన్నికల ముందు శక్తివంతమైన ఐఈడీ మందుపాతరలు పేల్చినప్పటికీ ఓట్ల నమోదును 77శాతానికి పెంచగలిగామని శనివారం పదవీవిరమణ చేసిన ఓంప్రకాష్ రావత్ ప్రకటించారు.

సహజంగానే సహ తెలుగు రాష్ట్రం తెలంగాణా ఎన్నికలపై మనకు ఆసక్తి ఎక్కువగా ఉన్న మాట నిజం. 119 అసెంబ్లీ స్థానాలున్న ఈరాష్ట్రంలో ప్రజాకూటమిగా కాంగ్రెస్, తెలుగుదేశం, సీపీఐ తెలంగాణ జనసమితి (ప్రొ.కోదడరామ్)పార్టీలు కలిశాయి. ఇవన్నీ కేసీఆర్ కుటుంబ పాలనపై యుద్ధం చేస్తూ అధికారంలోకి రావాలని తహతహ లాడుతుండగా, ఎలాగైనా బీజేపీ కాస్త ఎక్కువ బలం పుంజుకోవాలని ఆశగా ఎదురు చూస్తోంది. ఏది ఏమైనా బీజేపీ, కాంగ్రెస్ జాతీయ నాయకుల హెలికాప్టర్లు హైదరాబాద్‌లో దిగుతూనే ఉన్నాయి. ఇప్పటికే ఒక రౌండ్ సోనియా, రాహుల్ గాంధీల ప్రచారం కొనసాగగా, రెండో రౌండ్ కోసం నాయకులు ఏర్పాట్లు చేశారు. బీజేపీలో కూడా అదే పరిస్థితి కొనసాగుతోంది. దక్షిణాదిలో బీజేపీని బలోపేతం చేయడానికి ప్రధాని మోడీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా కష్టపడుతున్నారు. అయితే వీరి ఖర్చులను భరించలేని అభ్యర్థులు బేర్ ..మంటున్నారు. సామాన్య నియోజక వర్గంలో రూ. 45 కోట్లు, రసవత్తరంగా జరిగే స్థానాల్లో రూ. 100 కోట్లు ఖర్చు అవుతున్నాయని గణాంకాలు తెలియచేస్తున్నాయి. రోజుకు రూ. 50 లక్షలు ఖర్చుచేస్తున్నట్లు అభ్యర్థులు చెబుతున్నారు. ఎన్నికల ప్రకటన నుంచి ముందంజలో ఉన్న తెలంగాణ ఆపధర్మ ముఖ్యమంత్రి సుడిగాలి పర్యటనతో రోజుకు 10 సభల్లో ప్రసంగిస్తున్నారు. ఎన్నికల ఫలితాలను తన సర్వేల ద్వారా ముందుగానే తెలియచేసే లగడపాటి ఈసారి రెబల్స్‌కే ప్రాముఖ్యత ఉంటుందని, 10 మంది స్వతంత్రులు గెలుపుకు దగ్గర్లో ఉన్నారని ప్రకటించారు.

మిజోరం చాలా చిన్న రాష్ట్రం ఇక్కడ కేవలం 40 సీట్లే ఉన్నాయి. మూడు సార్లు వరుస విజయాలతో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారం చేపట్టింది. అయితే ప్రస్తుతం అక్కడ అధికార పార్టీపై వ్యతిరేకత ఎక్కువగా ఉంది. కనీన సౌకర్యాలు కూడా కరువయ్యాయని ప్రజలు అసంతృప్తిగా ఉన్నప్పటికీ కేంద్రంలో అధికారంలో ఉండే బీజేపీకి ఓట్లు వేసే పరిస్థితి కూడా లేదు. ఎందుకంటే ఆరాష్ట్రంలో జనాభాలో ఎక్కువ మంది క్రైస్తవులు. దీంతో తినేతిండి, మిగతా విషయాల్లో కాషాయదళాలు ఎలాంటి నిషేధాలు ప్రయోగిస్తారో అని సంశయంగా ఉన్నారు. ఇక్కడ త్రిముఖ పోటీ జరుగుతోంది. అయితే ఈ ఏడాది మాత్రమే ఇంటింటికీ ప్రచారం చేసుకునే అవకాశం కలిగింది.

రాజస్థాన్‌లో రైతు ఆత్మహత్యలు, మహిళలపై లైంగికదాడులు, దళితులు, ముస్లింలపై గోరక్షక దళాల దాడులు అధికంగా ఉన్నాయి. రాష్ట్ర ఆపధర్మ ముఖ్యమంత్రి వసుంధరరాజేపై వ్యతిరేకత తీవ్రంగా ఉంది. దీన్ని ఉపయోగించుకొని రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి రావాలని కాంగ్రెస్ భావిస్తోంది. వరుసగా మూడుసార్లు బీజేపీ ఈ రాష్ట్రాన్ని హస్తగతం చేసుకుంది.ఝులరాపతాన్ నుంచి ఇద్దరు ఉద్దండులు ఎన్నికల బరిలోకి దిగనున్నారు. ఒకరు వసుంధరారాజే కాగ మరొకరు కాంగ్రెస్ అభ్యర్థి మన్వేందర్ . కాంగ్రెస్‌కే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని భావిస్తున్నారు. 200 అసెంబ్లీ సీట్లు ఉన్న ఈరాష్ట్రంలో గెలుపుకోసం కాంగ్రెస్ రైతులకు రుణమాఫీ,నిరుద్యోగులకు రూ.3,500 భృతి, వృద్ధ రైతులకు పింఛన్ వంటి పథకాలను మేనిఫెస్టోలో చేర్చింది.

మధ్యప్రదేశ్‌లో 230 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. గత రెండు అసెంబ్లీ ఎన్నికల నుంచి బీజేపీ హవాకొనసాగుతోంది.రైతుల ఆందోళన, పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలు బీజేపీకి వ్యతిరేకంగా మారాయి.ఆపధర్మ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ వ్యాపం, డంపర్ స్కాం వంటివాటిలో ఆయన పేరు ప్రఖ్యాతంగా వినిపిస్తోంది. ఇక్కడ పాగా వేయడంకోసం కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. ఎన్నికల ప్రకటన ఎన్నికల కమిషన్ చీఫ్ రావత్ హయాంలో ప్రారంభం అయినప్పటికీ రెండోదశ ఎన్నికలు, ఫలితాలు మాత్రం కొత్త చీఫ్ సునీల్ ఆరోరా ఆధ్వర్యంలో వెలువడనున్నాయి.

మాజీ ఎమ్మెల్యే జస్టిస్ కె.పున్నయ్య కన్నుమూత

శ్రీకాకుళం: మాజీ న్యాయమూర్తి, మాజీ ఎమ్మెల్యే జస్టిస్ కె.పున్నయ్య(96) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న పున్నయ్య విశాఖపట్నంలోని పినాకిల్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. పున్నయ్య స్వస్థలం శ్రీకాకుళం జిల్లా సంతకవిటి మండలం కావాలి గ్రామం. రెండు సార్లు పున్నయ్య ఎమ్మెల్యేగా గెలిచారు. ఏపీ మాజీ స్పీకర్ ప్రతిభా భారతి పున్నయ్య కూతురే. పున్నయ్య చికిత్స అందిస్తున్న సమయంలోనే ఆయన కుమార్తె ప్రతిభా భారతికి గుండెపోటు వచ్చింది. దీంతో ఆమెకు బైపాస్ సర్జరీ చేశారు. అనంతరం ఆమె కోలుకుంది. జస్టిస్ పున్నయ్య మృతి పట్ల వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంతాపం తెలిపారు. ఒక న్యాయకోవిదుడిని కోల్పోయామని, జస్టిస్ పున్నయ్య కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు వెల్లడించారు.

సామాజిక వేత్త అంబేద్కర్

(డిసెంబరు6న అంబేద్కర్ 63వ వర్ధంతి సందర్భంగా)

బడుగు,బలహీన కులాల సామాజిక న్యాయం కోసం, అంతరాలు తొలగించి, దేశాన్ని అభివృద్ధి పథంలో నడపడం కోసం అహర్నిశలు కృషి చేసిన అంబేద్కర్ బీమాబాయి రాంజీ మాలోజీ దంపతులకు 1891 ఏప్రిల్ 14న జన్మించారు.రాంజీ బ్రిటీష్ ఆర్మీలో సుబేదార్‌గా పని చేసేవారు. మహారాష్ట్రలోని రత్నగిరిజిల్లా అంబెవాడ వీరి స్వంత గ్రామం. అయితే మధ్యప్రదేశ్‌లోని కేంద్ర ప్రాంతంలో రాంజీ విధులు నిర్వహిస్తుండటంతో ఆయన అక్కడే పెరిగారు.

వివాహం

అంబేద్కర్‌కు 15 ఏళ్ల వయస్సులో 1906లో రమాబాయితో వివాహం జరిగింది, ఆయనకు ప్రతి విజయంలో ఆమె పూర్తి సహకారం అందించారు, ఆమె చిరిగిన దుస్తులు ధరిస్తూ కూడా బాబాసాహెబ్ చదువుకు, ఆయన చేసే కార్యక్రమాలకు ఏనాడూ ఆటంకం కలిగించలేదు. రక్త హీనతతో 1935 ఆమె మృతి చెందారు.

డాక్టర్. సవిత అంబేద్కర్

అసలు పేరు శారద కబీర్, ఆమె అంబేద్కర్‌కు వైద్యసేవలు అందించేవారు. రాజ్యాంగ రచన సమయంలో నిద్రలేమి, కాళ్ళలో కండరాల సమస్య వలన దెబ్బ తిన్న ఆరోగ్యాన్ని దగ్గర ఉండి చూసుకోవడం కోసం 15 ఏప్రిల్ 1948న సవితను రెండో వివాహం చేసుకున్నారు..

అంబేద్కర్ మరణం: రాజకీయ పరిస్థితులు, తన అనుచరులు అనుకున్న వారి వ్యవహార శైలితో తీవ్ర మానసిక వత్తిడితో నిద్రలేమి,మధుమేహ వ్యాధితో బాధ పడ్డారు. తన ఆఖరి పుస్తకం 'బుద్ధ అండ్ హిస్ ధమ్మ 'పూర్తి చేసిన మూడురోజులకు 1956 డిసెంబరు 6న ఆయన నిద్రలోనే కన్నుమూశారు.

దళితులు అంటే ఎవరు ?

మతంతో సంభందం లేకుండా అపరిశుభ్రమైన వృత్తులు చేసేవారిని, సమాజంలో వివక్షతకు గురై అభివృద్ధి చెందని వారినే దళితులు అంటారు.

దళిత ముస్లింలు

దూదేకుల (కాటన్ క్లీనర్స్), మెహటర్ ముస్లింలు (స్కావెంజర్) పారిశుద్ధ్య పనివారు, బిక్షాటన చేసే ఫకీరు సాహెబులు, మంగలి (బార్బర్), మాంసం వృత్తులవారు (ముస్లీం బుచ్చర్స్), ఎలుగు బంట్లు, పాములు ఆడించేవారు, గారడి చేసేవారు, తట్టలు, బుట్టలు, చాపలు అల్లేవారు, రాళ్లు, బండలు కొట్టేవారు, బొరేవాలే వంటి 96 ముస్లిం కులాలను దళిత ముస్లింలంటారు. ముస్లిం సమాజంలో 85 శాతం దళితులే

బ్రిటీష్ గణాంకాలు

బ్రిటీషు పాలనలో 1901, 1911, 1922, 1932 లో ముస్లిం కులాలపై జనాభా సర్వేచేసి మొదట 133, తరువాత 102 చివరిగా 96 అపరిశుభ్రమైన వృత్తులు గల ముస్లిం కులాలను 1935 లో దళిత ముస్లింలుగా షెడ్యూల్ చేసి 1936 సంవత్సరం నుంచి రిజర్వేషన్ కల్పించారు. **దళిత ముస్లింలకు 1936 నుంచి జులై 1950 వరకు ఎస్సీ హోదా కొనసాగింది.** స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆగస్టు 10న రాజ్యాంగంలోని షెడ్యూల్ 1950 – పేరా 3, రాష్ట్రపతి ఉత్తర్వులు 1950 పేరా – 3 ద్వారా ఈ ఎస్సీ హోదాను అపరిశుభ్రమైన వృత్తులుగల దళిత హిందువులకు మాత్రమే పరిమితంచేసి, అదే అపరిశుభ్రమైన వృత్తుల్లోని దళిత ముస్లింలకు, సిక్కులకు, బౌద్ధులకు, క్రైస్తవులకు, జైన్లు పారిశీకులు తొలగించారు.1950 లోనే దళిత ముస్లింలను ఓబీసీలుగా ప్రకటించారు కానీ 1993 వరకు అమలు పరచలేదు.1956 లో దళిత సిక్కులకు, 1990 లో బౌద్ధులకు తిరిగి ఎస్సీ హోదా కల్పించారు. దళిత జైనులు, పారశీకులు రిజర్వేషన్లు అక్కర్లేదని ప్రకటించగా,దళిత ముస్లింలకు, క్రైస్తవులకు తిరిగి ఎస్సీ హోదా నేటికి కల్పించలేదు.రాజ్యంగ సూత్రం 25 ప్రకారం అందరికి మతస్వేచ్ఛ ఉన్నప్పటికీ హిందువులకు మాత్రమే ఎస్సీ హోదా కల్పించింది. 1994లో వేసిన సచార్ కమిటి అధ్యయనంలో దళిత ముస్లింలపై ఎస్సీ హోదా తొలగించండతో వారు అన్నిరంగాల్లో అత్యంతవెనుకబడి ఎస్సీ/ఎస్టీలకన్నా దుర్భర జీవితాలను గడుపుతున్నారని తెలిపింది. తర్వాత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రంగనాథ్ మిశ్రా కమిషన్ దళిత ముస్లింలకు, క్రైస్తవులకు తొలగించిన ఎస్సీ హోదా తిరిగి కల్పించాలని సిఫార్సు చేసింది. అంతేకాదు ఎస్సీ హోదా నుంచి

వారిని తొలగించడం భావప్రకటనా స్వేచ్ఛకు, లౌకిక వాదానికి విరుద్ధమని మతవివక్షను కొనసాగించరాదని అధ్యయంలో పేర్కొంది. ఇద్దరు తమ రిపోర్టులను 2005 – 2006 లోనే ఇచ్చారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కీ.శే డాక్టరు వైఎస్సార్ 2005 ఆగస్టు 25న అసెంబ్లీలో తొలగించిన ఎస్సీ హోదాను రాజ్యాంగాన్ని సవరించైనా దళిత క్రైస్తవులకు, దళిత ముస్లింలకు తిరిగి కల్పించాలని సిఫారసులు చేసినారు. ఇటువంటి తీర్మానాలు 10 రాష్ట్రాల్లో నమోదయ్యాయి. 2004లో సుప్రీంకోర్టు లో కూడా దీనిపై 180/2004 పిటిషన్ దాఖలు చేశారు. ఎస్సీహోదాను కాంగ్రెస్ ఇవ్వకుండానే 2014 వరకు కాలంగడిపింది.

ప్రయోజనాలు

ఇది సాధిస్తే ముస్లీంలో 85శాతం అభివృద్ధి చెందుతారు.ఐఏఎస్‌లు ,ఐపీఎస్, ఎంఎల్ఏ, ఎమ్మెల్సీ, ఎంపీ, మంత్రులు, ఉపముఖ్యమంత్రులు అవుతారు. పంచాయతీ మెంబరు నుంచి రాష్ట్రపతి వరకు రిజర్వేషన్ వస్తుంది. దళిత ముస్లిం, దళితులు, గిరిజన సమాజం అభివృద్ధి చెందుతుంది.

> నా కులం ఎక్కువ కాదు నేనూ నీలాంటివాడినే అనడం అభ్యుదయం
>
> నీకులం ఎక్కువేం కాదు నువ్వూ నాలాంటి వాడివే అనడం పోరాటం
>
> ఒకరు ఎక్కువ కాదు ఒకరు తక్కువ కాదు మనిద్దరం సమానమే అనడం సమానత్వం

ఆర్టిస్ట్ హాసిఫ్ ఖాన్ ఈ బొమ్మ వేసారు. ఆయన ఆనంద విగడన్ అనే తమిళ పత్రికలో పని చేస్తున్నారు. ఈ ఫొటో ఆయన షేర్ చేసినప్పుడు తమిళ్‌లో ఒక మంచి విశ్లేషణ వచ్చింది.

"మార్క్స్: అందరికీ టీ ఇవ్వండి.
అంబేద్కర్: అందరికీ ఒకే రకమైన గ్లాసుల్లో టీ ఇవ్వండి.
పెరియార్: అందరికీ సమాన కొలతలో టీ ఇవ్వండి."

రిజర్వేషన్లు అనుభవిస్తోందెవరు ?

భారత ప్రభుత్వం నివేదిక 2011 ఆధారంగా భారత దేశ జనాభా నూటముప్పై కోట్లు. ఎస్సీల జనాభా 18 శాతం, ఉద్యోగుల శాతం 8, ఎస్టీలు 7శాతం కాగ ఉద్యోగులు 3శాతం, బీసీల జనాభా 52శాతం, ఉద్యోగులు7 శాతం మాత్రమే, ఓసీల జనాభా 13 శాతం కాగ, ఉద్యోగుల శాతం 82గా ఉంది.

పాలనాధికారం ఎవరిది ?

ప్రధాని మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండగా, తనకులాన్ని అప్పటి కేంద్ర బీజేపీ ప్రభుత్వంలో బీసీగా మార్చుకున్నారు.

కేంద్ర మంత్రి వర్గం

అరుణ్ జైట్లి (బ్రాహ్మణ), సుష్మాస్వరాజ్ (బ్రాహ్మణ) మనోహర్ పారికర్ (ప్రస్తుత గోవా ముఖ్యమంత్రి) (బ్రాహ్మణ), నితిన్‌గడ్కరీ(బ్రాహ్మణ) అనంత కుమార్(బ్రాహ్మణ), జె.పి నడ్డా (బ్రాహ్మణ) కలరాజ్ మిశ్రా(బ్రాహ్మణ), ప్రకాశ్ జవదేకర్(బ్రాహ్మణ), సురేష్ ప్రభు(బ్రాహ్మణ), మేనక గాంధీ(బ్రాహ్మణ), స్పీకర్ సుమిత్రా మహాజన్(బ్రాహ్మణ), రాజ్‌నాథ్ సింగ్ (క్షత్రియ), రాధా మోహన్ సింగ్ (క్షత్రియ), అశోక్ గజపతి (మాజీకేంద్రమంత్రి) (క్షత్రియ), నరేందర్ సింగ్ తోమర్(క్షత్రియ), రవి శంకర్ ప్రసాద్(కాయస్థ), హర్ష వర్ధన్ (బనియా) వైశ్యా హసిమ్రతకౌర్ (జాట్ సిక్కు), సదానంద గౌడ(వక్కాలిగా), వెంకయ్య నాయుడు (ప్రస్తుత ఉప రాష్ట్రపతి)(కమ్మ), బీరేందర్ సింగ్(జాట్) స్మృతి ఇరాని (ఫార్సి) ఉన్నారు.

మినిస్టర్ ఆఫ్ స్టేట్ విత్ ఇండిపెండెంట్ ఛార్జ్ నిర్మల సీతారామాన్(బ్రాహ్మణ), మహేష్‌శర్మ (బ్రాహ్మణ), విజయ్ గోయల్(వైశ్యా), పీయాష్ గోయల్ (వైశ్యా), డా. జితేందర్ సింగ్(క్షత్రియ), రాజీవ్‌ప్రతాప్ రుడి (క్షత్రియ), రావు ఇంద్రజిత్ సింగ్ క్షతిత్రయ కింగ్,హర్యానా), ధర్మేంద్ర ప్రధాన్ (క్షత్రియ), మంజ్ సిన్హా (కాయస్థ), మహాదేవ్ దవే (కాయస్త్), శ్రీ పాద యాసోనాయక్ (మరాఠా) పదవులు నిర్వహిస్తున్నారు.

ఓటర్లలో ఎస్సీ,ఎస్టీ,బీసీలు 85 శాతం మంది. ఇప్పుడు చెప్పండి పదవులు ఉద్యోగాలు ఎవరు రిజర్వేషన్లలో ఉన్నాయో...

ప్రతిభ ఏ ఒక్క కులం, మతం,జాతి సోత్తు కాదని అందరికీ తెలిసిందే,అందరికీ సమాన అవకాశాలు దక్కినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది.అందుకే సామాజిక, ఆర్థిక పరిస్థితి లను దృష్టిలో పెట్టుకుని మన దేశంలో వ్యవస్తీకృతమైన కుల వ్యవస్థి కు తగినట్లుగా రిజర్వేషన్లు రుపొందించాడు మహా నీయుడు భారత రత్న అంబేద్కర్.

– ఖాన్

బెజవాడ రేడియోకు డెబ్బయ్యేళ్ళు

1936లో అప్పటి ఆంగ్లేయ ప్రభుత్వం, భారత దేశంలో రేడియో వ్యాప్తిని గురించి పరిశీలించడానికి నిపుణులను నియమించింది. అప్పుడు మద్రాసు రాజధానిలో తమిళ జిల్లాలతో పాటు కొన్ని తెలుగు, కన్నడ, మళయాళ జిల్లాలు కూడా కలిసివుండేవి. మద్రాసునుంచి నాలుగు భాషల్లో ప్రసారాలు చేయాలనీ, విజయవాడ నుంచి కానీ, రాజమండ్రి నుంచి కానీ తెలుగు ప్రసారాలు చేయాలని మొదట్లో అనుకున్నారు. కానీ చివరకు తెలుగు కార్యక్రమాలను కూడా మద్రాసు నుంచే ప్రసారం చేయాలని నిర్ణయించారు.

"1947లో దేశం స్వాతంత్రం సాధించేనాటికి, ఆలిండియా రేడియో వ్యవస్థలో ఢిల్లీ, కలకత్తా (కోల్ కతా), బొంబాయి(ముంబై), మద్రాసు(చెన్నై), లక్నో, తిరుచిరాప్పల్లి (తిరుచి, ట్రిచి)రేడియో కేంద్రాలు మాత్రమే వుండేవి. మద్రాసు నుంచే కాక డెక్కన్ రేడియో నుంచి, మైసూరు నుంచి(చాలా అరుదుగా) తెలుగు ప్రసారాలు జరిగేవి. స్వాతంత్రం వచ్చిన తరువాత సర్దార్ వల్లభాయ్ పటేల్ సమాచార, ప్రసార శాఖల మంత్రి అయ్యారు. ఆయన పర్యవేక్షణలో దేశంలో రేడియో వ్యాప్తికి కృషి మొదలయింది. 1956 నుంచి ఆలిండియా రేడియో సంస్థను 'ఆకాశవాణి'గా పేర్కొంటున్నారు.

"1948 అక్టోబర్ 12 నాడు విజయవాడలో రేడియో కేంద్రం మొదలయింది. దీనితో మద్రాసు కేంద్రం నుంచి ప్రసారమయ్యే తెలుగు కార్యక్రమాలు క్రమంగా తగ్గుతూ వచ్చాయి.

డెక్కన్ రేడియో (హైదరాబాదు,

ఔరంగాబాదు) రేడియో కేంద్రాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నది. 1950 ఏప్రిల్ ఒకటో తేదీన హైదరాబాదు రేడియో కేంద్రం 'ఆలిండియా రేడియో' వ్యవస్థలో భాగంగా పనిచేయడం ప్రారంభించింది.

"1955 నవంబర్ రెండో తేదీన మొదలయిన బెంగలూరు రేడియో కేంద్రం, 1963 జూన్ లో మొదలయిన పోర్ట్ బ్లేయర్ కేంద్రం కూడా తెలుగులో ప్రసారాలు చేస్తున్నాయి. 1957 అక్టోబర్ మూడో తేదీన మొదలయిన 'వివిధ భారతి' ప్రసారాలలో తెలుగు పాటలు రోజూ అరగంట సేపు వేసేవారు. 1969 సెప్టెంబర్ లో ఢిల్లీ, పాట్నా, రాంచీ, సిమ్లా రేడియో కేంద్రాల నుంచి తెలుగు నేర్పే పాఠాలు ప్రారంభించారు. 1991 మార్చి రెండో తేదీన హైదరాబాదు, విజయవాడలలో వాణిజ్య ప్రసారాలు మొదలుపెట్టారు.

"కాలక్రమేణా కడపలోను, విశాఖపట్నంలోను ఆకాశవాణి కేంద్రాలు ఏర్పాటయ్యాయి. స్థానికంగా అంటే జిల్లా స్థాయిలో రేడియో సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో మొదలు పెట్టిన తొలి స్థానిక రేడియో కేంద్రాలలో ఆదిలాబాదు కేంద్రం ఒకటి. వరంగల్లులో 1990 ఫిబ్రవరి 17 వ తేదీనాడు ప్రారంభమైన ఆకాశవాణి కేంద్రం, ఆకాశవాణి వ్యవస్థలో ఏర్పడ్డ నూరవ కేంద్రంగా చరిత్రకెక్కింది. ప్రస్తుతం ఆకాశవాణి వ్యవస్థలో మన రాష్ట్రంలో హైదరాబాదు, విజయవాడ, విశాఖపట్నం, కడప, ఆదిలాబాదు, కొత్తగూడెం, వరంగల్లు, నిజామాబాదు, తిరుపతి, అనంతపురం, కర్నూలు, మార్కాపురం మొదలైన చోట్ల తెలుగులో కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. మాచెర్ల, కరీంనగర్, సూర్యాపేట మొదలయిన చోట్ల ప్రసార వ్యవస్థలు వున్నాయి. వంద వాట్ల సామర్థ్యం కలిగిన ట్రాన్స్ మిటర్లను ఒంగోలు, నెల్లూరు, కామారెడ్డి, బాన్స్ వాడ, నంద్యాల, ఆదోని, కాకినాడ మొదలయిన చోట్ల ఏర్పాటు చేశారు"(ఇతి వార్తాః)

(హైదరాబాద్ ఆకాశవాణి పూర్వ సంచాలకులు డాక్టర్ పీఎస్ గోపాల కృష్ణ అందించిన వివరాల ఆధారంగా)

బాబోయ్.. ఇవేం నోట్లు ?

(మొదటిపేజీ తరువాయి)

పనికొచ్చేవి. కొత్తగా వచ్చిన రూ.2000, రూ.500 నోట్లు అప్పుడే పాడైపోతున్నాయి. సమస్య ఎక్కడొస్తోందంటే, ఈ పాడైన నోట్లను బ్యాంకులలోని సెన్సార్లు గుర్తించట్లేదు. అవి నిజమైన నోట్లుగా యంత్రాలు భావించట్లేదు. ఫలితంగా బ్యాంకు అధికారులు వాటిని పక్కన పెడుతున్నారు. తిరిగి రిజర్వ్ బ్యాంకుకు పంపుతున్నారు. కాగితం నాణ్యత బాగుంటేనే, నోట్లను ఏటీఎం సెన్సార్లు గుర్తిస్తాయి. ఈ ఏడాది కొత్తగా విడుదల చేసిన రూ.10 నోటు నాణ్యత కూడా సరిగా లేదన్న వాదన వినిపిస్తోంది. అయితే ఈ ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం ఖండించింది. భద్రతా ప్రమాణాల విషయంలో రాజీ పడలేదని తెలిపింది. నోట్లను విపరీతంగా మడతపెట్టడం, చీరకొంగులో, పంచెల్లో ముడివేయడం వల్ల ఎక్కువగా నలిగి వాడటానికి పనికిరాకుండా పోతూ ఉండొచ్చని ఆర్థిక శాఖలోని బ్యాంకింగ్ డివిజన్ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు.

ఎస్ఆర్ఎంలో మానవకణ పరిశోధన ప్రయోగశాల

(మొదటిపేజీ తరువాయి)

మైక్రోస్కోప్ వంటి పరికరాలను ప్రయోగశాలలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శాస్త్రసాంకేతిక రంగాల్లో పరిశోధనలకు తమ విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ కేంద్ర బిందువుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. త్వరలో విశ్వవిద్యాలయంలో మరికొన్ని పరిశోధన ప్రయోగశాలలు ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. రానున్న ఏడాది కాలంలో మరో 8 పరిశోధన కేంద్రాలు ఏర్పాటవుతాయన్నారు. కార్యక్రమంలో మానవ కణ పరిశోధన ప్రయోగశాల ముఖ్య శాస్త్రవేత్త అనిల్ కె.సురేష్, రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖర్, డిప్యూటీ రిజిస్ట్రార్ శివకుమార్, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ ఎమ్మెల్యే అభ్యర్థికి తప్పిన ప్రమాదం

గజ్వేల్ : గజ్వేల్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకుల విజయ తృటిలో పెను ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. విజయ ప్రయాణిస్తున్న కారు శనివారం ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో కారు తీవ్రంగా దెబ్బతింది. ప్రాణాపాయ స్థితి నుంచి ఆకుల విజయ తృటిలో తప్పించుకున్నారు. గజ్వేల్ నుంచి పోటీ చేస్తున్న ఆపద్ధర్మ సీఎం కేసీఆర్‌పై బీజేపీ తరపున ఆ పార్టీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు ఆకుల విజయను బరిలో దింపిన విషయం తెలిసిందే. గత ఎన్నికల్లో సిరిసిల్ల నుంచి మంత్రి కేటీఆర్‌పై బీజేపీ తరపున విజయ పోటీ చేసి ఓటమి చెందారు.

కులమే జీవితం

'భారతీయులు ఎక్కడకు వెళ్లినా కులాన్ని కూడా మోసుకెళతారు. అమెరికాలో ఏదైనా ప్రవాసాంధ్రుల కార్యక్రమాలు జరిగితే అందులో కూడా మతం, కులాలే ప్రధాన పాత్ర వహిస్తాయి' అని అంటున్నారు యాంట్స్ ఎమాంగ్ ఎలిఫెంట్ (ఏనుగుల మధ్య చీమలు) దళిత రచయిత గిడ్ల సుజాత. భారత్‌లోలానే ఇక్కడ కూడా కులాలను బట్టే ఆహ్వానాలు అందుతాయని, ఈ కార్యక్రమాలన్నీ హిందూ మతం చుట్టూనే తిరుగుతాయన్నారు. అయితే అమెరికన్లు మాత్రం అందరు ఆసియన్లను చూసినట్లే నన్నుకూడా చూస్తారని అంటరాని తనం లేదని చెబుతారు రచయిత్రి.



సుజాత తల్లి మంజుల, తండ్రి బాలయ్య ఇద్దరూ కళాశాల లెక్చరర్లే.. ఆమె కాకినాడ పీఆర్ కాలేజీ నుంచి డిగ్రీ వరంగల్ నిట్ నుంచి **మాస్టర్ ప్రోగ్రాం ఇన్ ఫిజిక్స్ చేశారు. మద్రాసు ఐఐటీ నుంచి అప్లయిడ్ ఫిజిక్స్‌లో రీసెర్చ్ స్కాలర్‌గా ఉన్నారు.** పీజీలో ఉండగా కులవివక్షతో కాలేజీ లెక్చరర్ పాస్ చేయనందుకు నిరసనగా ఆమె ఆందోళనలో పాల్గొంది. దీంతో ఆమెను అరెస్టు చేసి గుర్తుతెలియని ప్రాంతంలో మూడు నెలలపాటు పోలీసులు హింసించడంతో సుజాతకు క్షయ వ్యాధి సోకింది. ఇలాంటి విపత్కర సమయంలో ఆమె ఆచూకీ తెలుసుకోవడం కోసం తల్లి మంజుల **ప్రముఖ పౌరహక్కుల నేత, లాయర్ కన్నాభిరామ్‌తో** కోర్టులో పిటిషన్ దాఖలుచేయడంతో బయటకు వచ్చానని చెబుతారామే. ఎవరి ప్రమేయం, మన క్రియలతో సంబంధం లేకుండా కులం, మతం పేరుతో ఒకర్ని చులకనగా చూడటం మరొకరిని అందలం ఎక్కించడం ఏమిటని ఆమె ప్రశ్నిస్తాను. తాత ప్రసన్నరావు (తల్లి తండ్రి) కెనడీయుల సాయంతో క్రైస్తవ్యం తీసుకొని చదువు కొనసాగించారన్నారు. ఆమె ఐఐటీలో చదివేటప్పుడు చాలా మంది క్రైస్తవుల ఉన్నప్పటికీ ఈమెను మాత్రం వారిలో చాలా మంది చర్చికి వెళ్లేటప్పుడు కూడా కలుపుకునేవారు కాదని వాపోతారామె. వారిలో కాస్త మంచి అమ్మాయిని అడిగితే తెలిసిన నిజం ఏమంటే వారంతా వేర్వేరు రాష్ట్రాలకు చెందిన బ్రాహ్మణులు. అందువల్ల వారికి ఏ మతంలో ఉన్నా.. సమాజంలో గౌరవానికి భంగం వాటిల్లదు అని తెలుసుకున్నానని చెబుతారు సుజాత. 26 ఏళ్లకే అమెరికాలో అడుగుపెట్టిన

ఆమె మొదటిలో బ్యాంకు ఉద్యోగం చేసినప్పటికీ ప్రస్తుతం సిటీ సబ్‌వే కండక్టర్‌గా పనిచేస్తున్నారన్నారు. కార్మికులతో పనిచేయడంలోనే సంతోషముంటుందని అందుకే ఎల్లప్పుడూ బిజీగా న్యూయార్క్ నగరంలో అత్యంత రద్దీగా ఉండే రైల్వేల్లో ఉద్యోగం చేస్తున్నానంటారు. ' వి ద వుమెన్','స్మృతిఇరానీ' కార్యక్రమాల్లో ఆమె పాల్గొలేదు. స్మృతి ఇరానీ కేంద్ర మంత్రిగా రోహిత్ వేముల మరణానికి కారణమని, ఆమె చేతులు రక్తంతో తడిశాయని సుజా చెబుతారు.

కులవృత్తులను సమర్థిస్తూ ఎక్కడి వారు అక్కడే, ఏ పనిచేసే వారు ఆ పనిలోనే ఉండాలని కోరుకున్న గాంధీని 'హరిజనబాంధవుడని' ఎలా చెప్తామని ఆమె ప్రశ్నిస్తున్నారు.అలాగే, కులం పేరుతో రోజూ అవమానపరుస్తూ అదే నోటితో దేశాన్ని చూసి గర్వించు అంటే ఎలా అని నిలదీస్తున్నారు. గ్రామీణ భారతాన కులం పాత్రను ఆమె తన రచన యాంట్స్ ఎమాంగ్ ఎలిఫెంట్స్(ఏనుగుల మధ్యలో చీమలు)లో లోతుగా విమర్శించారు. అందరికీ అందరూ తెలిసిన గ్రామసీమల్లో మిగిలిన కులాలకు వారి వారి సామాజిక హోదాను బట్టి స్థానం ఉంటుంది. కానీ దళితులకు మాత్రం చోటులేదు. వారి స్థానం గ్రామ పొలిమేరలకావలే. వారిని మిగిలిన వారితో కలవనివ్వరు. ఆలయాల్లోకి వెళ్లనివ్వరు. బావుల్లో నీటిని ఉపయోగించుకోనివ్వరు. మిగిలిన కులాలతో కలిసి తిననివ్వరు" అని తాను పుట్టిపెరిగిన వాతావరణంలో తాను ఎదుర్కొన్న అనుభవాలను వివరించారు సుజాత గిడ్ల.తన జీవితానుభవాలను సామాజికాంశాలతో అనుసంధానం చేస్తూ ఆమె రచించిన యాంట్ ఎమాంగ్ ఎలిఫెంట్స్ పుస్తకంపై బీబీసీ న్యూస్, ,న్యూయార్క్ టైమ్స్ , గార్డియన్, అనేక జాతీయ,అంతర్జాతీయ మీడియాలో ఆమె పుస్తకంపై సమీక్షించారు కాకినాడ దగ్గర్లోని ఎల్విన్ పేటలో పుట్టి పెరిగిన సుజాత ప్రముఖ నక్సలైట్ నాయకుడు పీపుల్స్ వార్ వ్యవస్థాపకుల్లో ఒకరైన కేజీ సత్యమూర్తి మేనకోడలు.స్వయంగా సామాజిక ఉద్యమాల్లో పనిచేసిన వ్యక్తి. దళితురాలిగా చిన్నపుడు తాను ఎదుర్కొన్న అనుభవాలను ఆమె ఈ పుస్తకంలో వివరించారు.చిన్నపుడు ఇతర కులాలవారు ఏదైనా ఇవ్వాలనుకున్నపుడు చేతిని ముట్టుకోకుండా పైనుంచి జారవిడిచేవారని, చివరికి దుకాణంలో ఏదైనా కొనుక్కున్నపుడు చిల్లర కూడా పైనుంచి వేసేవారని తన అనుభవాలను వివరించారు.

గ్రామ సీమల్లో కులం స్పృహ మరీ పసిప్రాయంలోనే తెలిసివస్తుందని తన అనుభవాలతో వివరించారు. రెండేళ్లపుడే తల్లితో కలిసి వెళ్లిన చోట జరిగిన ఒక ఘటన సామాజిక అంతరాల గురించి తనకు ఎరుక కలిగించిందని ఆమె బీబీసికి వివరించారు. నక్సలైట్ నాయకుడిగా ప్రముఖ విప్లవ కవిగా శివసాగర్ అలియాస్ కేజీ సత్యమూర్తి పాత్ర గురించి తనపై ఆయన ప్రభావం గురించి ఆమె ఈ పుస్తకంలో వివరించారు.మరో ప్రపంచం పిలిచింది మరో ప్రపంచం పిలిచింది అనే శ్రీ శ్రీ విప్లవ గీతాన్ని చిన్నపుడు మామయ్య ద్వారా వినేదాన్ని అని చెపుతూ సామాజిక ఆర్థిక అంతరాలు లేని ఆ మరో ప్రపంచం ఎక్కడ, ఎంత దూరం అని సుజాత ప్రశ్నిస్తున్నారు. పుట్టుక ద్వారా సంక్రమించే ఏ ఆధిపత్యాన్ని అయినా సవాల్ చేయకుండా సమానత్వాన్ని, నిజమైన ప్రజాస్వామిక సమాజాన్ని సాధించగలమా అని ప్రశ్నిస్తున్నారు సుజాత.

కాలమ్

కేసీఆర్‌తో తుంటర్యూ..

ప్రశ్న : దళితుడిని..ముఖ్యమంత్రి ఎందుకు చెయ్యలేదు...?
జవాబు : 3 ఎకరాలు ఇద్దామని
ప్రశ్న : మరి ఎందుకు ఇవ్వలేదు..?
జవాబు : డబుల్ బెడ్ రూమ్ ఇద్దామని
ప్రశ్న : అది కూడా ఇవ్వలేదు కదా...?
జవాబు : ఇంటికో ఉద్యోగం ఇస్తే..వాళ్ళే కట్టుకుంటారని ఇవ్వలేదు..
ప్రశ్న : మరి ఉద్యోగాలు కూడా లేవుకదా..?
జవాబు : కెజీ టూ పీజీ ఇచ్చి...వారికి ట్రైనింగ్ ఇచ్చాక ఇస్తాం...
ప్రశ్న : ఎప్పటి నుంచి ప్రవేశపెడతారు...?
జవాబు : బంగారు తెలంగాణ అవగానే...
ప్రశ్న : ఎపుడు అవుతుంది....?
జవాబు : ప్రాజక్ట్ లు... పూర్తవగానే...
ప్రశ్న : ప్రాజక్ట్‌లు ఎప్పుడు పూర్తవుతాయి..?
జవాబు : చంద్రబాబు..కుట్ర చేస్తున్నాడు
ప్రశ్న : మరి మీరేం చేస్తున్నారు...?
జవాబు : మిషన్ భగీరథ ద్వారా..ఇంటింటికీ నల్లా ఇస్తున్నాం...
ప్రశ్న : ఎక్కడా రావటం లేదు కదా....?
జవాబు : మిషన్ కాకతీయ...పూర్తవగానే చెరువులు నిండి...నీరు పుష్కలంగా అందుబాటులోకి వచ్చాక...
ప్రశ్న : మిషన్ కాకతీయ ఎందుకు పూర్తి చేయలేక పోయారు..?
జవాబు : అక్రమ కట్టడాలు తొలగించాలి....
ప్రశ్న : అక్రమ కట్టడాలు తొలగించలేదు కదా...?
జవాబు : ఆంధ్రోళ్ళు గోలపెడతారని....
ప్రశ్న : వాళ్ళని తెగ తిడుతున్నారు కదా...?
జవాబు : లే..నేనెందుకు తిడతా...నాకేమన్నా పిచ్చా....వాళ్ళ కాళ్ళలో...ముల్లు గుచ్చుకుంటే పంటితో తీస్తా.....
ప్రశ్న : మరి..వాళ్ళే తెలంగాణ ద్రోహులు అంటారుగా...?
జవాబు : ఉద్యమం సమయంలో...లక్ష అంటాం..
ప్రశ్న : లక్ష అంటే గుర్తొచ్చింది..రామోజీ ఫిల్మ్ సిటీని..లక్ష నాగళ్ళతో దున్నుతామన్నారుగా..?
జవాబు : అన్ని ట్రాక్టర్లు దొరకలా...ఎన్ని ఉన్నాయో లెక్క వేద్దామని...కొంగరకలాన్‌లో మీటింగ్‌కి ట్రాక్టర్ ర్యాలీ పెట్టించా....లచ్చ రాలేదు...
ప్రశ్న : మరి తరువాత మీ ప్రోగ్రాం....?
జవాబు : ట్రాక్టర్లు లేకపోతే ఏమయింది...ఇంటింటికీ బర్రెలు, గొర్రెలు ఇచ్చాం....వాటిని అక్కడకి తోలి పిల్మ్ సిటీని స్వాధీనంచేసుకుంటాం.

దశబ్దాలు గడిచినా ఎన్ని పార్టీలు మరీనా గుంటూరు లో సంజీవయ్య నగర్ వాసుల పరిస్థితి మాత్రం మారలేదు. రాజీవ్ గాంధీ నగర్ , సంజీవయ్య నగర్ మరియు రెడ్డి పాలెం ప్రజలు గేట్ దాటడం అంటె వేరే ఊరు ప్రయాణించినట్టే. ఒకసారి రైల్వే గేట్ పడితే దాదాపు 45 నిమిషాల పాటు ఎదురు చూడాల్సిందే పారపాటున అంబులెన్స్ లేదా ఫైర్ ఇంజిన్ వొస్తే సరే సారి. ప్రజలు వల్ల అసహనం చూపకముందే రైల్వేస్ అధికారులు చర్యలు తీసుకోవడం మంచిది. బ్రిడ్జ్ వేస్తున్నామని అండర్ బ్రిడ్జ్ వేస్తున్నామని ఎంత మభ్య పెట్టిన ఈ సారికి ప్రజలు నమ్మే స్థితులో లేకపోవడం గమనార్హం.

- కిరణ్ కుమార్ గుంటూరు

మంగళగిరి వీవర్స్ కాలనీ మునిసిపల్ హై స్కూల్ ప్రక్కన రోడ్డుకు అడ్డంగా మట్టి కుప్పలు పోయడం వల్ల రోడ్డు కుదించుకుపోయి వాహనదారులకు తీరని ట్రాఫిక్ కష్టాలను మిగుల్చుతోంది సమీపంలోనే ప్రధమ పౌరుడు నివాసం ఉంటున్నారు గత కొద్ది రోజులుగా ఇదే పరిస్థితి నెలకొన్నా ఏ మాత్రం స్పందన లేదు



మట్టి కుప్పలు రోడ్డుకు అడ్డుగా పోయడం వల్ల మట్టి రోడ్డు ను తలపిస్తున్న దృశ్యం

నేడు మహేష్ ఏఎంబీ ప్రారంభం



హైదరాబాద్ : సూపర్ స్టార్ మహేష్ బాబు ఏషియన్ ఫిల్మ్స్ సంస్థతో కలిసి ఏఎంబీ సినిమాస్ పేరిట ఓ మల్టీప్లెక్స్‌ను నిర్మించారు. అమితాబ్ బచ్చన్, అమీర్ ఖాన్ ప్రధాన పాత్రలలో తెరకెక్కిన థగ్స్ ఆఫ్ హిందూస్థాన్ చిత్రంతోనే మల్టీ ప్లెక్స్‌ని ప్రారంభించాలని అనుకున్నప్పటికి , నిర్మాణం పూర్తి కాకపోవడంతో వాయిదా వేశారు. నవంబర్ 29న విడుదల అయిన భారీ బడ్జెట్ చిత్రం 2.0 చిత్రంతో ఏఎంబీ మల్టీప్లెక్స్‌ను ప్రారంభించాలని అనుకున్నా, తుది మెరుగులు పూర్తి కాకపోవడంతో ఆదివారం ఉదయం 10గంటలకు మల్టీ ప్లెక్స్‌ని గ్రాండ్‌గా లాంచ్ చేయనున్నారు. సాయంత్రం ఆరు గంటల నుంచి పలు సినిమాలు ప్రదర్శిస్తారు. 2.0 చిత్రంతో పాటు పలు హిందీ సినిమాలని మొదటగా ప్రదర్శించనున్నారు. గచ్చిబౌలిలో అధునాతన సౌకర్యాలతో ఈ మల్టీప్లెక్స్ నిర్మాణం జరుపుకోగా , ఇందులో మొత్తం 1638 సీటింగ్ కెపాసిటీ తో 7స్క్రీన్స్ అందుబాటులోకి రానున్నాయి. లేజర్ స్క్రీనింగ్ పనులు ఆలస్యం కావడం వల్ల మల్టీ ప్లెక్స్ ఓపెనింగ్ కొన్నాళ్లు పెండింగ్‌లో పడింది. మహేష్ భార్య నమ్రత ఈ మల్టీప్లెక్స్‌కి సంబంధించి ప్రమోషన్ కార్యక్రమాలు స్టార్ట్ చేసింది. తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఏఎంబీ పేరుతో ఉన్న పాప్‌కార్న్ కప్ ఫోటోని షేర్ చేస్తూ ఏఎంబి సంస్థలో నా ఫస్ట్ పాప్‌కార్న్ అనే కామెంట్ పెట్టింది. అలానే ఏఎంబీ సంస్థకి గుడ్‌లక్ కూడా తెలియజేసింది.

ఆయేషా హత్య కేసు సీబీఐకి బదిలీ

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రల్లో సంచలనం సృష్టించిన ఆయేషా మీరా హత్యకేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. ఈ కేసును సీబీఐ కోర్టుకి అప్పగాస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై కొత్త ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని పేర్కొంది. విచారణలో ఏపీ పోలీసులు ఇప్పటివరకూ ఎలాంటి పురోగతి సాధించకపోవడంతో హైకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. కాగా 2007 డిఈసీ 27న విజయవాడలోని ఓ హాస్టల్‌లో ఆయేషామీరా హత్యకు గురైన విషయం తెలిసిందే.

ఇది పాలనేనా...?

కబ్జాలు చేస్తుంటే ఎం చేస్తున్నారు..
సిపిఐ కౌన్సిల్ పక్ష నేత నందం బ్రహ్మేశ్వరరావు ధ్వజం

రాజధాని వార్తలు, మంగళగిరి : మంగళగిరి మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆక్రమణకు గురి అయిన మున్సిపాలిటీ స్థలాలు, బావులు, శానిటేషన్ సమస్యలపై మంగళగిరి మునిసిపల్ కౌన్సిల్ సమావేశం కౌన్సిల్ హాల్‌లో వాడి వేడి చర్చ జరిగింది. ఈ సమావేశానికి చైర్మన్ గంజి చిరంజీవి అధ్యక్షత వహించారు. సమావేశంలో కౌన్సిలర్లు అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఎజెండాని చదువుతుండగా సీపీఐ కౌన్సిలర్ నందం బ్రహ్మేశ్వరావు అడ్డుతగులుతూ ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురి అవ్వుతున్నాయని, అందులో మున్సిపాలిటీ స్థలాలు కబ్జాకు గురి అవ్వుతుంటే మీరు ఏమి చేస్తున్నారని అసలు అధికారులు ఏమిచేస్తున్నారని నిలదీశారు. అసలు ఉద్యోగాలు చేస్తున్నారా లేదా అని ప్రశ్నించారు. ఈవిషయంపై టిడిపి.బీజేపీ కౌన్సిలర్లు శృతి కల్పి అధికారులపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ బావులను సైతం పూడ్చి బిల్డింగ్‌లు కడుతున్నారని పర్మిషన్లు ఎలాయిస్తున్నారని, బావులను సైతం కబ్జాచేస్తున్నారని.ఇంత జరుగుతున్నా అధికారులు తెలియని వారిలా ప్రవర్తించడం బాధాకరమని అన్నారు. పట్టణం లో సైడ్ కాలువలు సైతం పూడ్చి వేసి ఇళ్లను నిర్మించారని అన్నారు.ఈ విషయం పై వాడి వేడి చర్చ జరిగింది. అనంతరం ఎజెండాపై చర్చ జరగగా ఏకగ్రీవంగా సభ్యులు ఆమోదించారు.

రాష్ట్రంలో 370 అన్న క్యాంటీన్లు

రాజధాని ప్రతినిధి, అమరావతి : రాష్ట్రంలో 370 అన్న క్యాంటీన్లు ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఇప్పటిదాకా పట్టణాల్లో 160, గ్రామీణ ప్రాంతాల్లో 53 అందుబాటులోకి వచ్చాయి. ప్రతి నియోజకవర్గంలోనూ కనీసం ఒకటి ఉండేలా చూస్తున్నట్లు మంత్రి లోకేశ్ వివరించారు. అమరావతి పరిధి ఉండవల్లిలో సీఎం నివాసం వద్ద అన్న క్యాంటీన్‌ను సీఎం శుక్రవారం రాత్రి ప్రారంభించారు. మంత్రులు, అధికారులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు.

రాజధాని క్లాసిఫైడ్స్

నివాస ప్లాట్లు

రాయపూడి
రాజధాని ప్రాంతంలోని రాయపూడి గ్రామ పరిధిలో 500, 1000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

ఇతరములు

ఓంశ్రీ సాయిరాం రిజిస్ట్రేషన్ కన్సల్‌టెన్సీ & సర్వీసెస్ అన్ని రకముల దస్తావేజులు, అగ్రిమెంట్లు వ్రాయబడును. స్టాంపులు అమ్మ బడును. అన్ని రకముల మోటారు వాహనములకు ఇన్సూరెన్స్ కట్టించు కొనబడును.
పాపన చక్రవర్తి డాక్యుమెంట్ రైటర్
ఫోన్ 9502424704, 08645 244992
సబ్ - రిజిస్ట్రార్ ఆఫీస్ ఎదురు, తుళ్ళూరు

వెలగపూడి
సాయి గణేష్ ట్రెడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : 9640811333

మందడం
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : 9553023388

వెంకటపాలెం
సాయిలాస్య రియల్‌ఎస్టేట్ & ఫైనాన్స్ కన్సెల్టెన్సీ, గాదె నాగేశ్వరరావు
ఫోన్ : 95151 53939

విశాఖపట్నం
చింతలూరు ఆయుర్వేద
డా॥ విశ్వనాథ్
ఫోన్ :90329 90138

షాప్స్

తుళ్ళూరు
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : 9848407935

తుళ్ళూరు
విజయలక్ష్మి జనరల్ స్టోర్స్
మీకు కావలసిన నాణ్యమైన నిత్యావసర వస్తువులు
ఫోన్ : 94414 11432

హస్పటల్స్

విజయవాడ
ఆంధ్ర హస్పటల్,
డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : 9177219900

విజయవాడ
న్యూఫేస్ కీనిక్ , డా॥మేహబూబ్
ఫోన్ : 9849122788

విజయవాడ
అష్రఫ్ మెటర్నిటీ & ఇ,ఎన్‌టి
డా॥ రెహమాన్
ఫోన్ : 0866-2475087

విద్యా సంస్థలు

ఐనవోలు
విఐటీ-ఏపీ యూనివర్శిటీ
ఫోన్ :0863 2370444

నీరుకొండ
ఎస్ఆర్ఎమ్ యూనివర్శిటీ
ఫోన్ :0863 2343000

వాణిజ్య ప్లాట్లు

నవులూరు
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

ఐనవోలు
రాజధాని ప్రాంతంలోని ఐనవోలు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

గమనిక : క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

- మేనేజర్

ప్రకటనలకు సంప్రదించండి 7680994755



వారసత్వ సంపదను పరిరక్షించుకుందాం..

అద్భుత కట్టడాలతో భారతదేశం అత్యంత సుందరమైనది, ఏడు వింతల్లో ఒకటి అయిన తాజ్‌మహల్ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం మూలంగా తన ప్రాభవాన్ని కోల్పోతోంది.

ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి యోగీ ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ప్రపంచ ప్రజలంతా అబ్బురంగా కొనియాడే తాజ్‌మహల్‌కు దుస్థితి దాపురించింది. ఆయన అధికారం చేపట్టగానే మొదట తాజ్‌మహల్‌ను పర్యాటకరంగ పుస్తకం నుంచి తొలగించారు. ఆపై అనేక నిరసనల తర్వాత మళ్లీ పర్యాటకరంగంలో చేర్చారు. అయితే ప్రభుత్వ నిర్లక్ష్యంతో రోజురోజుకు దాని అందం తరిగిపోతోంది. వెండి వెన్నెలతో సమానంగా తెల్లగా మెరిసిపోయే అద్భుత కట్టడం ఇప్పుడు కాలుష్యబారిన పడి పసుపుపచ్చగా మారుతోంది. దీంతో తాజ్ మహల్ సంరక్షణ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న ప్రభుత్వాల తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.



కాలుష్య కోరల్లో తాజ్‌మహల్

కాపాడతారా ? కూల్చేస్తారా ?

ఆ చారిత్రక కట్టడాన్ని కాపాడలేకపోతే.. కూల్చేయండని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాలు తాజ్ మహల్ బాగోగులను పట్టించుకుంటాయన్న ఆశ లేదని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఇప్పటికైనా ఆ కట్టడాన్ని పరిరక్షించకపోతే దాన్ని మూసివేస్తామని హెచ్చరించింది. పర్యావరణ కాలుష్యం నుంచి తాజ్ మహల్‌ను సంరక్షించేలా ప్రభుత్వాలను ఆదేశించాలంటూ పర్యావరణవేత్త హెచ్.సి. మెహతా దాఖలు చేసిన పిటిషన్ విచారిస్తూ సుప్రీంకోర్టు (ఈ ఏడాది జులై 11న) పై వ్యాఖ్యలు చేసింది.

ఈఫిల్ టవర్ కంటే అందమైంది..

పారిస్‌లోని ఈఫిల్ టవర్ కంటే మన తాజ్ మహల్ ఎంతో సుందరమైందని జస్టిస్ మదన్ బి లోకూర్, జస్టిస్ దీపక్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. 'టీవీ టవర్ లాంటి ఈఫిల్ టవర్‌కు ఏటా 80 లక్షల మంది వెళుతున్నారు.మన తాజ్ దానికంటే ఎంతో అందమైంది. సరైన నిర్వహణ చర్యలు చేపడితే భారత్‌కు ఆర్థికంగా తోడ్పడుతుంది. విదేశీ కరెన్సీ లోటును భర్తీ చేస్తుంది' అని ధర్మాసనం స్పష్టం చేసింది.

కయ్యానికి బీజేపీ సై

ఓ పురాతన దేవాలయంలో కొంత భాగాన్ని తీసుకొని తాజ్ మహల్‌ను నిర్మించారని ఉత్తర ప్రదేశ్ బీజేపీ చీఫ్ లక్ష్మీకాంత్ బాజ్‌పాయ్ వ్యాఖ్యానించగా, రాజా జై సింగ్ నుంచి తేజో మహాలయంలోని కొంత భాగాన్ని మొఘుల్ చక్రవర్తి షాజహాన్ కొనుగోలు చేశాడని, అందుకు సాక్ష్యాధారాలున్నాయని అన్నారు. ప్రపంచ వారసత్వ సంపదైన తాజ్ మహల్ పై అజాం ఖాన్ కన్నుపడిందని అన్నారు. తాజ్ మహల్ ఐదు సార్లు నమాజ్ చేసుకునేందుకు అంగీకరించాలన్న అజాం ఖాన్ కోరిక ఎప్పటికీ తీరదని సింగ్ అన్నారు. తాజ్ మహల్‌ను దేశద్రోహులు నిర్మించారంటూ యూపీ బీజేపీ ఎమ్మెల్యే సంగీత్ సోమ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ఓవైసీతోపాటు సమాజ్‌వాదీ, నేషన్ కాన్ఫరెన్స్ పార్టీలు



సైతం మండిపడ్డాయి. నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్ర కోట నుంచి కాకుండా నెహ్రూ స్టేడియంలో ప్రధాని జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తారేమోనని ఎద్దేవా చేశారు. తాజ్ మహల్‌ను ఎలాంటి వివాదాల్లోకి లాగొద్దు. ఇది ఎంతో ఆదాయాన్ని తెచ్చిపెడుతోందని సమాజ్ వాదీ నేత జూహి సింగ్ అన్నారు.ఇప్పటికే ఉత్తర ప్రదేశ్, కేంద్రం మధ్య కొనసాగుతున్న వివాదాల్లో కొత్తగా తాజ్ మహల్ చేరనుందని దేశప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తీవ్రకాలుష్యం

పరిశ్రమల వల్ల గాలిలో ఉండే సల్ఫ్యూరిక్ యాసిడ్, నైట్రిక్ యాసిడ్‌లను పాలరాయి పీల్చుకొని ఆక్సైడ్‌లుగా మార్చుతోంది. దీంతో పాలరాయి నాణ్యతకోల్పోయి పొడిగా రాలిపోతోంది. అదేసమయంలో వర్షంపడితే గాలిలో ఉండే సల్ఫర్, నైట్రస్‌లతో రసాయినిక చర్యలు జరిగి ఆమ్లవర్షంగా

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నవంబర్ 10 నుంచి తాజ్ మహల్ ప్రార్థించడానికి వీల్లేదంటూ నిషేధించింది.

రూపొందడంతో పాలరాయిలో ఉండే కాల్షియం కరిగి పోతోంది. దీంతో తాజ్ తన ప్రాభవాన్ని కోల్పోతోంది. ఆగ్రా చుట్టుపక్కల ఉండే రబ్బరు, రసాయినిక, ఆటోమోబైల్ పరిశ్రమలతో గాలిలో సల్ఫర్,నైట్రిక్ ఆక్సైడ్‌లు కలుస్తున్నాయి. మరీ ముఖ్యంగా మాథురా ఆయిల్ రిఫైనరీతో (చమురు శుద్ధి కర్మాగారం)తో కాలుష్యం తీవ్రతరం అయింది. 1984లో మొదటిసారి పర్యావరణవేత్త, సుప్రీంకోర్టు న్యాయవాది ఎంసీ మెహతా తాజ్‌మహల్‌ను కాలుష్యం బారి నుంచి రక్షించాలని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, 12 ఏళ్ల తర్వాత 1996లో సుప్రీం మార్గదర్శకాలను అమలు చేయాలని కోరుతూ తాజ్‌ట్రిపీజియంను రూపొందించింది. దీని ప్రకారం తాజ్‌కు చుట్టుపక్కల 50 కిమీ దూరం వరకు ఎలాంటి పరిశ్రమలను అనుమతించవద్దని, యమునానదిని కాలుష్యం నుంచి కాపాడాలని రాష్ట్రప్రభుత్వానికి ఆదేశించింది. అది జరిగిన 22ఏళ్లకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం, పురావస్తు శాఖ అలసత్వానికి ఆగ్రహం చెందిన సుప్రీంకోర్టు తాజ్‌ను కాపాడతారా ? కూల్చేస్తారా అంటూ ఆగ్రహం వెలిబుచ్చింది. మొగల్ చక్రవర్తి షాజహాన్ తన సతీమణి ముంతాజ్ మహల్‌కు గుర్తుగా నిర్మించిన ఈ చారిత్రక కట్టడాన్ని ఈ జనరేషన్ వరకే కాకుండా.. మరో 400 ఏళ్ల వరకు మన్నికగా ఉండేలా చర్యలు తీసుకుంటామని యూపీ ప్రభుత్వం గతంలో పేర్కొంది. దీనికి సంబంధించిన విజన్ డాక్యుమెంట్‌ను కోర్టుకు సమర్పిస్తామని చెప్పింది. కానీ, కార్యాచరణలో విఫలమైంది. ఈ అంశం సర్వోన్నత న్యాయస్థానానికి ఆగ్రహం తెప్పించింది.

ఇది..నాదేశం వీరంతా నా సహోదరులు.. నాదొక పెద్ద కుటుంబం అని ప్రతిభారతీయుడు భావించడమే అసలైన దేశభక్తి. 400 ఏళ్లుగా సామాన్యులతోపాటు అనేక దేశాధిపతుల మనస్సు దోచుకున్న తాజ్‌మహల్‌ను యునెస్కో వారసత్వ సంపదగా గుర్తించడం గర్వకారణం. దానిని సంరక్షించి భావితరాలకు అందిద్దాం.

– బోస్

ఎర్ర కోటను కూడా దేశ ద్రోహులే నిర్మించారు: ఓవైసీ

తాజ్ మహల్‌ను దేశద్రోహులు నిర్మించారంటూ యూపీ బీజేపీ ఎమ్మెల్యే సంగీత్ సోమ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ఎంఐఎం నేత అసదుద్దీన్ ఓవైసీ తీవ్రంగా స్పందిస్తూ ఎర్రకోటను కూడా దేశ ద్రోహులే నిర్మించారని.. అక్కడి నుంచి మోడీ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించకుండా ఆపుతారా అంటూ ప్రశ్నించారు. దేశ రాజధానిలోని హైదరాబాద్ ను కూడా దేశద్రోహులే నిర్మించారు. దేశ పర్యటనకు వచ్చిన విదేశీ నేతలకు అక్కడ ఆతిథ్యాన్ని మోడీ ఆపేస్తారా? అంటూ ఘాటుగా ప్రశ్నించారు.

బిడ్డకు తాజ్‌పేరు: డివిలియర్స్



భారత్‌పై ఉన్న అభిమానంతో దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ జాంటీ రోడ్స్ తన కూతురుకు 'ఇండియా' అని పేరు పెట్టిన సంగతి తెలిసిందే. తనకు పుట్టబోయే మూడో బిడ్డకు 'తాజ్' పేరు పెడతానంటున్నాడు దక్షిణాఫ్రికా మరో క్రికెటర్ ఏబీ డివిలియర్స్.'2012 ఐపీఎల్ జరిగే సమయంలో 'తాజ్‌మహల్' వద్దే డేనియల్‌కు నేను ప్రపోజ్ చేశా. ఆ మరుసటి ఏడాది మేమిద్దరం పెళ్లి చేసుకున్నాం. 2015లో మాకు బాబు పుట్టాడు. అతని పేరు అబ్రహాం. 2017లో మరో మగబిడ్డ పుట్టగా.. బాబుకి జాన్ రిచర్డ్ డివిలియర్స్ అనే పేరు పెట్టాం. మూడో చిన్నారికి 'తాజ్ డివిలియర్స్' అనే పేరును పెట్టాలనుకుంటున్నా.. అని డివిలియర్స్ ఓ ఇంటర్వ్యూలో తెలిపాడు. దేశవిదేశాలను ఆకట్టుకుంటున్న తాజ్‌ను మనం కాలుష్యం బారి నుంచి రక్షించుకుందాం.

మతవిద్వేశాల మధ్య బాబ్రీ





బాబ్రీ మసీదు మూడు గోపురాలతో కూడిన పెద్ద నిర్మాణం. ఇవి పరస్పరం సమాంతర దిశలలో ఉంటాయి. దీనికి అతిపెద్ద కేంద్రీయ చావడి అనుసంధానమై ఉంటుంది. ఈ చావడిలో ఉన్న లోతుబావి చల్లటి, కమ్మటి నీళ్లకు పేరుపొందింది. బాబర్ ఆదేశానుసారం మీర్ బాకి ఈ నిర్మాణాన్ని నిర్మించాడని పర్షియా భాషలో రెండు శాసనాలు ఈ పలకలపై ఉన్నాయి. బాబ్రీ మసీదు గోడలు తెల్లటి ఇసుక చట్టు ఫలకలతో దీర్ఘచతురస్రాకార రూపంలో రూపొందించగా, గోపురాలు మాత్రం మందపాటి చిన్నవైన కాల్చిన ఇటుకలతో కట్టారు. వాస్తుశిల్పి గ్రాహం పిక్‌ఫోర్డు చెప్పిన ప్రకారం "బాబ్రీ మసీదు మిహ్రాబ్ నుంచి గుసగుస ధ్వని కూడా 200 అడుగుల దూరం స్పష్టంగా వినబడుతుందని వెల్లడించారు. బాబ్రీ మసీదు నిర్మాణంలో వాడిన ఇసుక రాయి కూడా ధ్వనిని స్పష్టంగా ప్రసరింపచేయగల గుణాలు కలిగి ఉండగా, గుమ్మటాలు ప్రశాంత పర్యావరణాన్ని నింపుతుందన్నారు.

బావి కథ

కేంద్రీయ ఆవరణ ముంగిట గల లోతైన బావికి ఉన్నట్లుగా చెప్పబడిన ఔషధ లక్షణాల గురించి బీబీసీ1989 డిసెంబరు నివేదికలోనూ, అనేక వార్తా పత్రికల వార్తా నివేదికలలో విశేషంగా చెప్పబడింది. బాబ్రీ బావి నీటి గురించిన తొలి ప్రస్తావన ఫరీదాబాద్ జిల్లా 1918 గెజిట్‌లో రెండు వరుసలలోని మసీదు గురించి రెండు పంక్తుల ప్రస్తావనలో పొందుపర్చబడింది,

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

1949 డిసెంబరు 22 అర్ధరాత్రి, పోలీసులు నిద్రిస్తున్నప్పుడు 60 మంది వ్యక్తులు సీతారాముల విగ్రహాలను నిశ్శబ్దంగా మసీదులోకి పెట్టారని మరుసటి రోజు ఉదయం అయోధ్య పోలీసు ఠాణాలో కానిస్టేబుల్ మత ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదును సబ్ ఇన్‌స్పెక్టర్ రామ్ దూబే నమోదు చేశారు. తర్వాతి ఉదయం, ఒక భారీ హిందూ సమూహం దేవతా విగ్రహాలకు అర్పణలు చేసేందుకు మసీదులోకి వెళ్ళడానికి ప్రయత్నించిందని అప్పటి జిల్లా మేజిస్ట్రేట్ కె.కె.నాయర్ తెలుపుతూ 'ఆ సమూహం చాలా పట్టుదలతో తాళం పగులగొట్టి బలవంతంగా ప్రవేశించడంతో అత్యంత కష్టపరిస్థితుల్లో వారిని నియంత్రించవలసి వచ్చిందని' వెల్లడించారు. ఈ వార్త వినగానే ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి గోవింద్ వల్లభ్ పంత్ దేవతా విగ్రహాలు తొలగింపబడేలా చూడాలని ఆదేశించాడు. పంత్ ఆజ్ఞానుసారం, ప్రధాన కార్యదర్శి భగవాన్ సహాయ్, పోలీసు ఇన్స్పెక్టర్-జనరల్ వీఎస్ లహిరి ఫైజాబాద్‌కు దేవతా విగ్రహాలను తొలగించాల్సిందిగా తక్షణ ఉత్తర్వులు పంపారు. అయితే అప్పటి ఐసీఎస్ అధికారి కె.కె.నాయర్ హిందువులు ప్రతిఘటిస్తారని భయపడి ఆదేశాలను పాటించలేనని అభ్యర్థించాడు.

(బాబ్రీ విధ్వంశానికి నేటితో 27 ఏళ్లు)

ఇలా మతకలహాలతో ఒక విశిష్ట కట్టడం తన వైభవాన్ని కోల్పోయింది. లేకుంటే దేశవిదేశాల్లోని అనేక మంది పర్యాటకులు ఈ నిర్మాణ ప్రాశస్త్యం తెలిసి అబ్బురపడి ఉండేవారనడంలో ఎటువంటి సందేహం లేదు.

తెలుగు బైబిల్‌కు 200 ఏళ్లు

ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధ్వర్యంలో భారతీయ భాషల్లో బైబిల్ అనువాదాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుత పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని సీరాంపూర్‌లో ఈ అనువాదాలు జరిగాయి. 1818లో బైబిల్ కొత్త నిబంధన తెలుగు అనువాదం రెండు భాగాలుగా ప్రచురితమయింది. తెలుగులో తొలి బైబిల్ ప్రచురించి ఈ ఏడాదికి సరిగ్గా రెండు వందల ఏళ్ళు పూర్తయింది. 17, 18 శతాబ్దాల్లో క్రైస్తవ మిషనరీలు భారతదేశంలో క్రియాశీలంగా ఉన్నాయి. లూథరన్ మిషనరీకి చెందిన బెంజిమన్ షుల్జ్ అనే వ్యక్తి మొదటిసారి 18వ శతాబ్దపు తొలినాళ్లలో బైబిల్ తెలుగులోకి అనువాదం చేశారు.ఆ చేతిరాత ప్రతులను ప్రచురించడం కోసం అప్పట్లో జర్మనీ పంపారు. కానీ ఏ కారణం చేతనో అవి ముద్రణ కాలేదు. ఆయన రాసిన చేతిరాత ప్రతులు కూడా దొరకలేదు. ఇది జరిగిన చాన్నాళ్ల తరువాత రెండు వేర్వేరు సంస్థలు, వేర్వేరు ప్రాంతాల్లో బైబిల్ తెలుగు అనువాదం ప్రారంభించాయి.

విలియం కేరీ ఆధ్వర్యంలో బాప్టిస్ట్ మిషనరీ సొసైటీ సంస్థ ప్రస్తుత పశ్చిమ బెంగాల్లోని సీరాంపుర్ దగ్గర బైబిల్ అనువాద ప్రక్రియ ప్రారంభించింది.అదే సమయంలో లండన్ మిషనరీ సొసైటీ సంస్థ నుంచి అగస్టస్ దె గ్రాంజెస్. జార్జ్ క్రాన్‌లు ఆనందరాయర్ అనే స్థానికుడి సహకారంతో విశాఖపట్నంలో ఈ అనువాద ప్రక్రియ ప్రారంభించారు. ఈ అనువాదం ప్రారంభించిన అగస్టస్ 1809లో, జార్జి 1810లో చనిపోయారు. దీంతో ఆ అనువాద ప్రక్రియను జాన్ గార్డన్, ఎడ్వర్డ్ ప్రిచెట్‌లు కొనసాగించారు.వారు మరణించడానికి ముందే మాథ్యూ (ముత్తయి), మార్క్ (మార్కు), ల్యూక్ (లూకా) అధ్యాయాలను పూర్తి





చేశారు. ఈ మూడు అధ్యాయాలు 1812లో విలియం కేరీ ఆధ్వర్యంలోని మిషనరీ ప్రెస్‌ల ముద్రించారు.నిజానికి అదే సమయంలో సీరాంపూర్‌లో విలియం కేరీ ఆధ్వర్యంలో మరో అనువాదం కొనసాగుతున్నప్పటికీ, తాము చేస్తున్న అనువాదం కంటే విశాఖ నుంచి వచ్చిన అనువాదానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి ముద్రించారు కేరీ. బైబిల్‌ను అన్ని భాషల వారికీ తక్కువ ధరకు చేరవేయాలనే ఉద్దేశంతో "బ్రిటిష్ అండ్ ఫారిన్ బైబిల్ సొసైటీ" 1804లో లండన్‌లో ఏర్పాటు చేశారు. బైబిల్ అనువాదాలు, పంపిణీ చేసే ఇతర సొసైటీలకు ఈ సంస్థ ఆర్థిక సహకారం అందించింది. ఈ బ్రిటిష్ సంస్థకు అనుబంధంగా భారత్ లో 1811లో కలకత్తా ఆగ్జిలరీ బైబిల్ సొసైటీ ఏర్పడింది.

విశాఖలో జరిగిన బైబిల్ అనువాదాన్ని కలకత్తా ఆగ్జిలరీ సొసైటీ ఆమోదం కోసం పంపారు. ఆ ప్రతిని పరిశీలించడం కోసం మద్రాస్‌లో ఉండే థాంప్సన్‌కి పంపించింది కలకత్తా సొసైటీ.అప్పటికే మద్రాస్ ప్రెసిడెన్సీలో తెలుగు పండితుడిగా పేరు గాంచి క్యాంప్ బెల్, ఫోర్ట్ సెయింట్ జార్జ్ కాలేజీలో పనిచేసే మరో స్థానిక తెలుగు పండితుడు ఈ ప్రతిని పరిశీలించారు. "సరళంగా, సులువుగా అర్థమయ్యేలా, సమగ్రంగా ఉందనీ, ప్రజలకు సరిపోతుందనీ, సాధారణ ఉపయోగానికి పనికొస్తుందని" వారు తెలిపారు. ఈ వ్యాఖ్యలు చూసిన కలకత్తా ఆగ్జిలరీ సొసైటీ, విశాఖలో తయారయిన ఈ ప్రతినే ముద్రించాలని తీర్మానించింది. దీంతో ఈ ప్రతిని ఎడ్వర్డ్ ప్రిచెట్ ఆధ్వర్యంలో మద్రాసులో ముద్రించారు. అప్పటికే సీరాంపూర్ లో అనువాదమయిన ప్రతిని కూడా ముద్రించినా, విశాఖలో తయారయిన ప్రతినే తెలుగులో ప్రామాణింకంగా తీసుకుని, దాన్నే సరఫరా చేశారు. ఆ తరువాత ముద్రితమైన బైబిల్ అనువాదాలు కూడా దీని ఆధారంగానే వచ్చాయి. బైబిల్‌ని తెలుగులో అనువదించే ఘనత దక్కించుకున్న లండన్ మిషనరీ సొసైటీ.. మద్రాస్ ప్రెసిడెన్సీలోని ఉత్తర సర్కారులో (ప్రస్తుత కోస్తాంధ్రలోని ఉత్తర భాగాలు – విజయవాడ నుంచి పైన) ప్రారంభమైన తొలి ప్రొటెస్టెంట్ మిషనరీ.1805లో విశాఖ కేంద్రంగా వారు కార్యక్రమాలు ప్రారంభించారు. ఆ తరువాత విశాఖలో వచ్చిన మిషనరీలు కూడా తెలుగు అనువాదాలు కొనసాగించాయి.అనంతరం బైబిల్ అనువాదాలను రివిజన్ చేసే కార్యక్రమం జరిగింది. మద్రాస్ ఆగ్జిలరీ బైబిల్ సొసైటీ ఒక బైబిల్ రివిజన్ కమిటీ వేసింది. అప్పుడు బైబిల్‌ను తెలుగులోకి అనువాదం చేసిన వారిలో జాన్ హే, రెవరెండ్ పులిపాక జగన్నాథంలను ప్రముఖంగా పేర్కొనవచ్చు. 1818లో కేవలం బైబిల్ కొత్త నిబంధన మాత్రమే అనువాదం అయింది. అప్పట్లో కొత్త నిబంధనను కూడా రెండు సంపుటాలుగా ముద్రిం చారు. అప్పటికి పాత నిబంధన అనువాదం ప్రారంభం కాలేదు.బైబిల్ అనువాదానికి సంబంధించిన ఈ సమాచారం అంతా మిషనరీల రికార్డుల్లో ఉంది. తొలి ప్రతి 2వ వాల్యూమ్ ప్రస్తుతం బెంగళూరులోని యునైటెడ్ థియోలాజికల్ కాలేజీలో ఉంది. తొలి ప్రతి కాపీలు బెంగళూరులోని బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియాలో ఉన్నాయి. ప్రతి మొదటి సంచిక లండన్‌లోని బ్రిటిష్ లైబ్రరీలో ఉంది. తొలి ప్రతి 2వ వాల్యూమ్ కాపీ 2005లో విశాఖలో లండన్ మిషనరీస్ సంస్థ ద్విశతాబ్ది (200) వార్షికోత్సవం సందర్భంగా తెప్పించారు. అప్పటి బిషప్ ఆదేశాల మేరకు దాన్ని బెంగళూరు పంపించారు. కొత్త నిబంధన అనువాదానికి దాదాపు పదేళ్లు పట్టింది. బైబిల్ పాత నిబంధన హిబ్రూ భాషలో, కొత్త నిబంధన గ్రీకు భాషలో రాసి ఉంది.కొత్త నిబంధనను గ్రీకు నుంచి లాటిన్ భాషకు అనువదించిన సెప్టెంబరు 30వ తేదీని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ అనువాదాల దినోత్సవంగా నిర్వహిస్తోంది.

(విజయ మేరి)

కొత్త సినిమాల సందడి

పొలిటికల్ బ్యాక్ గ్రౌండ్‌తో శ్రీకాంత్ హీరోగా నటించిన ఆపరేషన్ 2019 రిలీజవ్వగా,డిసెంబర్ 7న ఏకంగా అరడజను చిత్రాలు రిలీజ్ కానున్నాయి. వీటిలో ఆర్జీవీ సమర్పిస్తున్న భైరవగీత – బెల్లంకొండ హీరోగా నటించిన కవచం – సుమంత్ – సుబ్రమణ్యపురం – సందీప్ కిషన్– నెక్స్ట్ ఏంటి? – బెక్కం– హుషారు – శుభలేఖలు చిత్రాలు రిలీజవుతున్నాయి. భైరవగీత యాక్షన్ ఫ్యాక్షన్ బ్యాక్ డ్రాప్ – సుబ్రమణ్యపురం థ్రిల్లర్ బ్యాక్ డ్రాప్ – కవచం కాప్ డ్రామా .. ఈ సినిమాల లుక్ లు – టీజర్ లు ఆసక్తి పెంచాయి.

డిసెంబర్ 21న మూడు సినిమాల మధ్య గట్టి పోటీ నెలకొననుంది. ఎందుకంటే మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్– ఘాజీ సంకల్ప్ రెడ్డి కాంబినేషన్ లో తెరకెక్కుతున్న స్పేస్ బ్యాక్ డ్రాప్ మూవీకి ఇండస్ట్రీ వర్గాలు సహా అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. అలాగే శర్వానంద్ – సాయి పల్లవి జంటగా నటిస్తున్న రొమాంటిక్ ఎంటర్ టైనర్ 'పడి పడి లేచే మనసు' పైనా యూత్ లో ఫాలోయింగ్ ఉంది. వీటితో పాటు కన్నడ హీరో యశ్ నటించిన 'కేజీఎఫ్' తెలుగు – తమిళం – కన్నడం – హిందీలో అత్యంత భారీగా రిలీజవుతోంది. కోలార్ బంగారు గనుల్లో బానిసత్వం .. హిస్టారికల్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపైనా భారీ అంచనాలేర్పడ్డాయి. అటుపై డిసెంబర్ 28న నిఖిల్ జర్నలిస్టుగా నటించిన 'ముద్ర' రిలీజవుతుంది. వీటితో పాటు రిలీజ్ తేదీల్ని ఖాయం చేసుకునే పనిలో ఉన్న సినిమాలు మరో 7-8 ఉన్నాయని తెలుస్తోంది. అంటే మొత్తం 20సినిమాలు పైగానే క్యూలో ఉన్నాయి. అటుపై సంక్రాంతి రేసులో అతి పెద్ద పందెం ఉంటుంది. 'కథానాయకుడు' 'వినయ విధేయ రామా' 'ఎఫ్ 2' పెట్టా వంటి భారీ చిత్రాలు క్యూలో ఉన్నాయి.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2016-18, Cell 7680994755, Email : rajadhanivartalu1@gmail.com